ఆర్యవైశ్య సంఘం కమిటీ

మల్లికార్జున్

చెన్నూర్, జూలై 29 : చెన్నూర్ ఆర్యవైశ్య సంఘం కమిటీని ఎన్నుకున్నట్లు ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు ముక్త శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చిలువేరు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా కుక్కడపు నరేందర్, కోశాధికారిగా చకినారపు హరీశ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య ప్రతినిధులంతా పాల్గొని, కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

ట్రస్మా నస్పూర్ పట్టణ కమిటీ

మైదం రామకృష్ణ

సీసీసీ నస్పూర్, జూలై 29 : ట్రస్మా నస్పూర్ పట్టణాధ్యక్షుడిగా సీసీసీ నస్పూర్‌కు చెందిన ఎయిమ్స్ స్కూల్ కరస్పాండెంట్ మైదం రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీసీసీ కార్నర్‌లోని సృష్టి ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం ట్రస్మా మండల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, రాష్ట్ర సహాయ కార్యదర్శి పెట్టం మల్లయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్ పాల్గొన్నారు. ఈ ప్రాంత ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కోశాధికారిగా అంబాల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా చెన్నూరి అమన్‌ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నస్పూర్‌లోని పలు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

నిండుకుండలా 'ఎల్లంపల్లి'

నిండుకుండలా మారిని ఎల్లంపల్లి ప్రాజెక్టు

హాజీపూర్, జూలై 29 : శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువ నుంచి భారీగా వరదరావడంతో నిండింది. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టు క్రస్ట్ లెవల్ 148 మీటర్లకు గాను 147.15కు చేరింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, 17.8137 టీఎంసీలుగా నమోదైంది. మొత్తంగా 16,081 క్యూసెక్కుల (కడెం ప్రాజెక్టు నుంచి 8,203, ఎగువ ప్రాంతం నుంచి 7,879 క్యూసెక్కులు) వరద ఇన్‌ఫ్లోగా వస్తున్నది. ఇక్కడి నుంచి హైదరాబాద్ ప్రజల తాగునీటి కోసం 331 క్యూసెక్కులు, నందిపంప్ హౌస్ నుంచి 15,750 క్యూసెక్కులు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

కాసిపేట, జూలై 29 : కాసిపేట మండలం మల్కెపల్లి గ్రామంలో ఆదివారంరాత్రి మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యువకులు అర్ధరాత్రి మద్యం తాగి రోడ్ల మీదికి వచ్చారు. ఆ మైకంలో మరికొందరు యువకులను పిలిచి, బహిరంగంగా దాడులు చేసుకున్నారు. అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాల వల్ల రాత్రుళ్లు తాగి ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉందని, తాగిన మైకంలో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వాపోతున్నారు. రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ ఇళ్లలో గొడవలు చేయడం సర్వసాధారణమని అంటున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకులను ప్రశ్నిస్తే.. ఎక్కడైనా చెప్పుకోండంటూ తెగించి చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, ఇక్కడి నుంచే గుట్కా దందా సాగుతున్నదని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనాథ అక్కాచెల్లెళ్లకు ఆర్థికసాయం

మందమర్రి, జూలై 29 : మందమర్రి మున్సిపాలిటీ పరిధి ఊరు మందమర్రిలో తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలుగా మిగిలిన అక్కాచెల్లెళ్లు అర్చన, అభిలాషకు ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అండగా నిలిచారు. 'నాడు తండ్రి నేడు తల్లి మృతి' అని ఈ నెల 26న 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి సొసైటీ సభ్యులు స్పందించి, సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.4వేల సాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వాయిదాపడిన అర్చన వివాహానికి కూడా సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీముద్దీన్, ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్, పట్టణాధ్యక్షుడు నదిపాట రాజ్‌కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్, ఎండీ జావీద్‌పాషా, నాగరాజు, అజయ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం

సీసీసీ నస్పూర్, జూలై 29 : ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తూనే ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ తెలిపారు. సీసీసీ నస్పూర్ నర్సయ్య భవన్‌లో సోమవారం పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వర్‌రావు అధ్యక్షతన పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి దేశవ్యాప్తంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల 4న నస్పూర్ నర్సయ్య భవన్‌లో మండల నిర్మాణ కౌన్సిల్, మంచిర్యాలలో 10న జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఉంటుందని, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కమిటీని ఎన్నుకోగా, పట్టణ కార్యదర్శిగా మిర్యాల రాజేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శులుగా తంగళ్లపల్లి సురేశ్, దొడ్డిపట్ల రవీందర్, కోశాధికారిగా గుడెల్లి రాజయ్య ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి రామగుడు లక్ష్మణ్, నాయకులు జోగుల మల్లయ్య, లింగం రవి, కారుకూరి నగేశ్, రేగుంట చంద్రశేఖర్, బాజీసైదా, ముస్కె సమ్మయ్య, కొట్టె కిషన్‌రావు, కొడి వెంకటేశం, అఫ్రోజ్‌ఖాన్, లచ్చిరెడ్డి, కంచం పోషం, మర్రి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తాజ్ బాబా సందల్ ఉర్సు

ర్యాలీలో జడ్పీ మాజీ చైర్మన్ కృష్ణారావు,నాయకులు

కాగజ్‌నగర్, జూలై 29 : కాగజ్‌నగర్ పట్టణంలో తాజ్ బాబా సందల్ ఉర్సు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విజయబస్టే నుంచి ఉర్సు ఉత్సవ సందల్ శోభాయాత్ర ప్రారంభించి, పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ తాజ్ బాబా దర్గా వద్ద చాదర్ సమర్పిస్తారు. జడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎంఐఎం పట్టణాధ్యక్షుడు ముబీన్, ముస్లింలు పాల్గొన్నారు.

పెద్దవాగు వద్ద దిగబడ్డ లారీ

రోడ్డుపై దిగబడ్డ లారీ

కాగజ్‌నగర్, జూలై 29 : కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్ద వాగు అప్రోచ్ రోడ్డుపై సోమవారం లారీ దిగబడింది. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగజ్‌నగర్ నుంచి దహెగాం మండలానికి వెళ్తున్న లారీ.. ఇటీవల పెద్దవాగు వంతెనపై నిర్మించిన అప్రోచ్ రోడ్డులో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు జేసీబీ సాయంతో బయటకు తీశారు.

వాహనాల తనిఖీ

వేమనపల్లి, జూలై 29 : మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ ఆధ్వర్యంలో మంగెనపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాలు ఉన్నందున మహారాష్ట్రలో మావోయిస్టుల అలజడి నేపథ్యంలో అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముమ్మరంగా తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం సరైన పత్రాలు లేనివాహనాలకు జరిమానా విధించారు.

మందమర్రి : గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఏ విజయలక్ష్మి

నెన్నెల : మొక్కలు నాటుతున్న అటవీ శాఖ సిబ్బంది

కాగజ్‌నగర్ : జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎఫ్‌డీవో అప్పలకొండ

ప్రపంచ పెద్దపులుల దినోత్సవం

- పలు చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ
- పులుల సంరక్షణపై గ్రామాల్లో అవగాహన

జన్నారంలో బైక్ రాలీ తీస్తున్న అటవీ శాఖ అధికారులు

జన్నారం, జూలై 29 : ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా జన్నారం రేంజ్ ఆఫీసర్ సుష్మారావు ఆధ్వర్యంలో అటవీ అధికారులు మండల కేంద్రంలోని రేంజ్ కార్యాలయం నుంచి టీడీసీ సెంటర్ వరకు బైక్ ర్యాలీ తీశారు. అనంతరం జన్నారం, తాళ్లపేట రేంజ్‌లోని సహజసిద్ధమైన నీటికుంటలు, గడ్డి క్షేత్రాలు, గోండుగూడ వాచ్‌టవర్, బైసన్ కుంటల వద్ద ప్రింట్, ఎలక్ట్రానికి మీడియా విలేకరులకు అవగాహన కల్పించారు. కవ్వాల్ అడవుల్లోకి పెద్దపులి వచ్చేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించిన అటవీ శాఖ అతిథిగృహం ఎదుట మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇందన్‌పెల్లి రేంజ్ ఆఫీసర్ హఫీజొద్దీన్, డీఆర్వో ప్రమోద్, పోచమల్లు, లాల్‌బాయి, అనిల్, రహీమొద్దీన్, గోపికృష్ణ తదితరులున్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, జూలై 29 : కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఇన్‌చార్జి ఎఫ్‌డీవో అప్పలకొండ, ఎఫ్‌ఆర్వో రమాదేవి ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. మండలంలోని అంకుసాపూర్, వంజీరి, నందిగూడ గ్రామాల్లో కళాజాత బృందాల ద్వారా పులుల రక్షణ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవులు, పులుల రక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాన్నారం, వెంకటాపూర్‌లో..

మందమర్రి రూరల్, జూలై 29 : మందమర్రి మండలం పాన్నారం, వెంకటాపూర్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఏ విజయలక్ష్మి(ఆవడం) ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కే రమేశ్ (మామిడిగట్టు) పాల్గొని గ్రామస్తులకు పులులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగారంలో..

నెన్నెల, జూలై 29 : మండలంలోని గంగారం గ్రామంలో ఆవుడం ఫారెస్ట్ సెక్షన్ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు మొక్కలు నాటారు. పెద్ద పులులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వాటితోనే అడవులకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు రాజేశ్వరి, నాయకులు శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరివెల్లి, ఖర్జీలో..

దహెగాం, జూలై 29 : మండలంలోని గిరివెల్లి, ఖర్జీ గ్రామాల్లో ఎఫ్ఎస్వో రవికుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. పులుల విశిష్టతను వివరించారు. ఎఫ్ఎస్వో బాపు, ఎఫ్‌బీవో మధూకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇటిక్యాల పహాడ్‌లో..

సిర్పూర్(టీ), జూలై 29 : మండలంలోని ఇటిక్యాల పహాడ్‌లో గ్రామస్తులకు పులుల సంరక్షణపై ఫారెస్ట్ సెక్షన్ అధికారి వల్క మోహన్‌రావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పులి బొమ్మకు పూజలు నిర్వహించారు. పులుల రక్షణతో పాటు సంరక్షణకు తమ వంతు సహకరిస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు జీతాలేవి?

- మూడు నెలలుగా నిరీక్షణ
- కుటుంబాలు గడువక తీవ్ర ఇబ్బందులు
- ప్రత్యేకాధికారుల పాలనలోనూ అందని వేతనాలు

రోడ్డుపై చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న పంచాయతీ కార్మికులు

వాంకిడి, జూలై 29 : గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాల్లేవు. ప్రజా ప్రతినిధుల పదవులు ముగిసినా, ప్రత్యేక అధికారుల పాలన మొదలైనా నిరీక్షణ తప్పడంలేదు. నెలనెలా వచ్చే ఆ కొద్ది జీతంతోనే కుటుంబాలను పోషించుకునే కార్మికులు.. మూడు నెలలుగా రాకపోవడంతో అప్పు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నిత్యం ఉదయం 6 గంటలకు మొదలుకొని సాయంత్రం వరకు గ్రామాల్లో పరిశుభ్రత కోసం బిజీబిజీగా ఉంటున్నారు. మండల కేంద్రంలో 32 మంది పంచాయతీ కార్మికులు పని చేస్తున్నారు. ప్రతి రోజూ చెత్త సేకరించి, శివారులోని డంప్‌యార్డుకు చేరవేస్తుంటారు. మురుగు కాల్వలను శుభ్రం చేయడంలో కీలకంగా పని చేసి, గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ట్రాక్టర్ ద్వారా నిత్యం పట్టణాల తరహాలో ఇంటింటికీ వెళ్లి, చెత్తను సేకరిస్తున్నారు. చాలీచాలని వేతనాలు కూడా సరిగా ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని జీపీ కార్మికులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు చెల్లించాలని అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

❖ చాలా ఇబ్బందైతున్నది..

కొన్నేళ్లుగా పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న. మాకు మూన్నెళ్లుగా వేతనాలు అస్తలేవు. అధికారులను అడిగినా పట్టించుకుంటలేదు. ఏం చేయాలో తోస్తలేదు. ఎవరిని అడిగినా వస్తాయంటున్రు. కానీ, రావడం లేదు. నెలకు రూ.8వేల చొప్పున వేతనం ఇస్తున్నరు. ఆ వచ్చే కొద్దిపాటి వేతనాన్ని ప్రతినెలా అందించేలా చర్యలు తీసుకోవాలె. మా పనిని గుర్తించాలె.

- ఇగురపు రాజయ్య, పంచాయతీ కార్మికుడు, వాంకిడి

❖ అధికారులు పట్టించుకోవాలె..

పని చేసినా వేతనాలు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. సర్పంచుల పాలనలో నెల నెలా వేతనాలు ఇచ్చేవారు. స్పెషలాఫీర్ల పాలన నడుస్తున్నది. వాళ్లను అడిగితే ఫైల్‌ను పై అధికారులకు పంపిచామంటున్నరు. వచ్చాక వేతనాలిస్తమంటున్నరు. నెలల తరబడి వేతనాలు ఇయ్యకుంటే బతుకుడెట్లా. ఊరిలో ప్రతీ పని మాతోనే చేయిస్తున్నరు.

- వడ్లూరి ఉషయ్య, పంచాయతీ కార్మికుడు, వాంకిడి

❖ నిధుల కొరత వల్లే అందలేదు..

పంచాయతీ కార్మికుల వేతనాలు నిలిచిపోయిన మాట వాస్తవమే. మూడు నెలలుగా వారికి జీతాలు అందడంలేదు. నిధుల కొరత కారణంగానే నిలిచిపోయాయి. కార్మికుల సమస్యలను ఉన్నతాధికారులకు వివరించాం. ప్రభుత్వం నిధులు జమచేయగానే కార్మికుల వేతనాలను తమ ఖాతాల్లో జమచేస్తాం.

- శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి, వాంకిడి

విద్యుత్ శాఖలో ఈ స్టోర్ విధానం

ఎస్ఈ శ్రావణ్‌కుమార్

మంచిర్యాలటౌన్, జూలై 29 : ఎస్పీడీసీఎల్ మంచిర్యాల సర్కిల్ పరిధిలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు నూతన సాంకేతిక విధానాన్ని అవలంభిస్తున్నామని, అందులో భాగంగా ఈ-స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టామని జిల్లా సూపరింటెండెట్ ఇంజినీర్ ఎన్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. సంబంధిత సెక్షన్ ఏఈ మొదటగా ఒక పనికి కావాల్సిన మెటీరియల్ స్టాక్ ఉందో లేదో సాప్(ఎస్ఏపీ) సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్‌లో చూసుకొని రిజర్వ్ చేసుకుంటారని పేర్కొన్నారు. ఆ మెటీరియల్ తాలూకు సమాచారం ఎస్ఏపీ వర్క్ ఫ్లో ద్వారా సంబంధిత ఏడీఈకి, తర్వాత స్టోర్స్‌కు వర్క్ ఫ్లో ద్వారా ఆన్‌లైన్‌లో వెళ్తుందని తెలిపారు. మెటీరియల్ తీసుకునే అధికారికి, ఏ రోజు రావాలో ఆ తేదీని, సమయాన్ని ఎస్ఎంఎస్ రూపంలో, సాప్ మెయిల్ రూపంలో తెలియజేయబడుతుందని వివరించారు. ఆ సమయం ప్రకారం స్టోర్‌కు వెళ్లి మెటీరియల్ తీసుకొని పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో పేపర్ ప్రస్తావన ఉండదని, మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని, అందువల్ల చాలా సమయం ఆదా అవుతుందని, త్వరితగతిన పనులు పూర్తవుతాయని వివరించారు. వినియోగదారుల పనులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రవేశపెట్టకముందు కావాల్సిన మెటీరియల్ లిస్ట్‌ను ప్రింట్ తీసుకొని, సంతకాలు తీసుకొని, ఆ పేపర్ సంబంధిత అధికారికి అందచేసి, సామగ్రిని తీసుకోవాల్సి ఉండేదని వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకే ఈ-స్టోర్ విధానాన్ని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు సాప్ టీం తయారు చేశారని తెలిపారు. ఈ పద్ధతి వల్ల ఎంతగానో సమయం ఆదా అవుతుందని వివరించారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సర్చ్

ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

హాజీపూర్, జూలై 29 : శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల ఏసీపీ రత్నపురి ప్రకాశ్ తెలిపారు. మండలంలోని దొనబండలో సోమవారం హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పోలీసులు, అధికారులు గ్రామంలోని ఇండ్లను తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని 32 బైకులు, ఆటోను సీజ్ చేశారు. గ్రామంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నా, నేరస్తులు ఎవరైనా తలదాచుకున్నా సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్ వాడడం వల్ల నియంత్రణ కోల్పోయి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్, సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఈవోకు సన్మానం

సిర్పూర్(టీ), జూలై 29 : సిర్పూర్(టీ) మేజర్ గ్రామ పంచాయతీ ఈవో కృష్ణమూర్తి మంచిర్యాల జిల్లాకు బదిలీఅవగా, సోమవారం మాజీ పాలకవర్గ సభ్యులు సన్మానించారు. అనంతరం నూతన పంచాయతీ కార్యదర్శిగా తిరుపతి బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి మృతి

దహెగాం, జూలై 29 : మద్యానికి బానిసై ఆరోగ్యం క్షీణించడంతో మండల కేంద్రానికి చెందిన బండ మల్లేశ్(33) మృతి చెందినట్లు ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. భార్య వివాహేతర సంబంధం పెట్టుకున్నదనే కారణంతో మల్లేశ్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆరోగ్యం క్షీణించింది. ఆదివారం పరిస్థితి విషమించడంతో దవాఖానకు తరలిస్తుండగా, మార్గ మధ్యంలో మృతిచెందాడు. మల్లేశ్ సోదరుడు సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

30 శాతం నిధులు కేటాయించాలి

కన్నెపల్లి, జూలై 29 : విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులను కేటాయించాలని పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మనోహర్ డిమాండ్ చేశారు. మెట్‌పల్లి గ్రామంలో సోమవారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 7.31 శాతం నిధులను కేటాయించిందని, ఇవి దేనికీ సరిపోవన్నారు. బడ్జెట్‌ను సవరించి, 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ పెంపు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 31న అసెంబ్లీ ముట్టడికి తలపెట్టినట్లు తెలిపారు. నాయకులు సిద్ధార్థ, అజయ్, వినోద్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో యువతి మృతి

మందమర్రి, జూలై 29 : మందమర్రి పట్టణంలోని రెండో జోన్ కాలనీకి చెందిన దుర్సెట్టి సాధన(22) సోమవారం పాముకాటుతో మృతిచెందిందని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సాధన మంచిర్యాలలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నది. సోమవారం సెలవు కావడంతో ఇంటివద్దే ఉన్నది. సాయంత్రం ఇంట్లో నిద్రపోయి, మంచం దిగుతుండగా, పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా, వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అంటువ్యాధులపై అవగాహన

వాంకిడి, జూలై 29 : మండలంలోని గణేశ్‌పూర్‌లో ప్రజలకు మండల ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కారోబారి గోపాల్ రావు, ఆశ కార్యకర్త మన్కు బాయి పాల్గొన్నారు.

మైనర్లకు కౌన్సెలింగ్

చెన్నూర్ టౌన్, జూలై 29 : చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ నేతృత్వంలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాత్రి వేళల్లో బైక్‌లతో శబ్దం చేస్తూ, జులాయిగా తిరుగుతున్న మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌లో తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లరి మూకలపై నిఘా ఉంచి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డుకు మరమ్మతులు

దహెగాం, జూలై 29 : మండలంలోని గెర్రె, గిర వెల్లి, ఖర్జీ గ్రామాల మధ్య రోడ్డుకు సోమవారం బీజేపీ నాయకులు మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా గుంతలమయమవగా, స్థానికులు రోడ్డు పరిస్థితిని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన, తన సొంత డబ్బుతో మరమ్మతులు చేయించాలని నాయకులను ఆదేశించారు. సింగిల్‌విండో చైర్మన్ తిరుపతి గౌడ్, వైస్‌చైర్మన్, పార్టీ మండలాధ్యక్షుడు ధనుంజయ్, బాపు బుజాడి వెంకన్న, రాజన్న, చంద్, సంజీవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు స్పాట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి, జూలై 29 : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంఈసీ గ్రూప్‌లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నిరుపమ తెలిపారు. ఎంఈసీ గ్రూప్‌లో ఎస్సీ విద్యార్థినులతో ఖాళీ సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్సీ బాలికలు తమ నిజ ధ్రువీకరణ పత్రాలతో హాజరవ్వాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

తిరుపతి (ఫైల్)

లక్షెట్టిపేట, జూలై 29 : గోదావరి రోడ్డు రాంనగర్‌కు చెందిన గాదనవేణి తిరుపతి(25) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సతీశ్ సోమవారం తెలిపారు. తిరుపతి ఇంటర్ పూర్తిచేసి, ప్రస్తుతం సెంట్రింగ్ పనిచేసుకుంటున్నాడు. తన అన్న ఆర్మీలో ఉద్యోగం సాధించి, జీవితంలో స్థిరపడ్డాడు. అతడిని ఆదర్శంగా తీసుకున్న తిరుపతి, ఆరీమలో చేరాలని ప్రయత్నించాడు. ఇప్పటి వరకు రెండుసార్లు దరఖాస్తు చేసుకొని, సెలక్షన్స్‌కు వెళ్లాడు. రన్నింగ్‌లో క్వాలిఫై కాకపోవడంతో తీవ్ర మనస్థాపం చెంది, ఉరేసుకున్నాడు. తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిదండ్రుల దాడిలో గాయపడ్డ కొడుకు మృతి

శేఖర్ (ఫైల్)

నెన్నెల, జూలై 29 : మండల కేంద్రంలోని పోచమ్మ వాడకు చెందిన తల్లిదండ్రులు అబ్బర్ల పద్మ-విజయ్ దాడిలో తీవ్రగాయాలపాలైన పెద్దకొడుకు శేఖర్(25) చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. 25వ తేదీన రాత్రి చిన్నకొడుకు అశోక్‌తో అబ్బర్ల పద్మ-విజయ్ గొడవపడ్డారు. అతడిని ఎలాగైనా చంపాలనుకున్నారు. అదేరోజు రాత్రి మద్యం మత్తులో పెద్దకొడుకు శేఖర్‌పై కొడవలితో దాడిచేసి, పరారయ్యారు. మూడురోజులు మృత్యువుతో పోరాడిన శేఖర్ సోమవారం తెల్లవారుజామున మతి చెందాడు. పద్మ, విజయ్‌ను రిమాండ్‌కు తరలించారు. పంచనామ